క్లుప్తంగా

ఫైలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



ఫైలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: దోమల వల్ల వచ్చే ఫైలేరియా వ్యాధి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీహెచ్ఈఓ నరసప్ప సూచించారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు రెండు రోజులుగా కోడుమూరులోని కాలనీల్లో ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇప్పటి వరకు 310 మందికి రక్త పరీక్షలు నిర్వహించి ఐదు అనుమానిత కేసులను గుర్తించామన్నారు. ప్రజలంతా దోమల వల్ల వచ్చే ఫైలేరియా వ్యాధి రాకుండా ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని నరసప్ప సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రంగస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాబాయి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అయోధ్య అంక్షింతలను పంపిణీ చేస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు

గడివేముల: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం గడివేముల మండలం గడిగరేవుల గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం నందు గ్రామస్తుల సమక్షంలో అయోధ్య అక్షింతలను భాజా భజంత్రీలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. రామ నామం జపిస్తూ అయోధ్య రాములవారి ప్రతిష్ట ఆహ్వానం, అక్షింతలను అందజేశారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో బాలరాముల ప్రతిష్ట కార్యక్రమాన్ని తిలకిస్తూ తదనంతరం అక్షింతలు వేసి ఆశీర్వచనం చేయాలని, ప్రతిఇంటా ఐదు ప్రమిదలను వెలిగించి పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యులు రాంప్రసాద్, ఆకుతోట మధుసూదన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ పూర్తి చేయండి



సి.బెళగల్‌లో వ్యవసాయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండలంలో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్ నమోదు చేయాలని, అలాగే రైతుల వేలిముద్రలు, ఇతర వివరాలతో ఈ–కేవైసీ పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలు, ఎంపీఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగులో మెలకువలను తెలియజేయాలని సూచించారు. ఏఈఓ సిద్ధు, సిబ్బంది ఉన్నారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీటి విడుదల



గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.719 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కృష్ణగిరి: గత నెల 15న ఆలంకొండ గ్రామంలో మాదిగ రామస్వామిని కులం పేరుతో దూషించి, దాడికి దిగాడన్న ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన బోయ మేకల సుంకన్నపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలోని బస్టాండులో ఓ హోటల్ వద్ద టీ తాగుతున్న రామస్వామిని నిందితుడు దూషించడంతోపాటు కాళ్లు, చేతులపై కర్రతో దాడి చేసి, చెవిని కొరికాడన్నారు. గ్రామస్తులు విడిపించడంతో ఆసుపత్రి వెళ్లి చికిత్స పొందిన అనంతరం పెద్ద మనుషుల పంచాయితీలో సైతం న్యాయం జరగకపోవడంతో పోలీసులనాశ్రయించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

రీసర్వే అభ్యంతరాలపై 37 అర్జీలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు, కొలురులో నిర్వహించిన రీసర్వేపై అభ్యంతరాల కొరకు నిర్వహించిన గ్రామ సభలో 37 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ శ్రీనివాసులుగౌడ్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొలురు నుంచి 24, కొత్తూరు నుంచి 13 అర్జీలు వచ్చాయన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఏమైన సమస్యలుంటే అర్జీలు ఇవ్వవచ్చన్నారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య
- కల్లూరు అర్బన్ వార్డులో అట్టహాసంగా పింఛన్ల పంపిణీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు





చెన్నమ్మ సర్కిల్‌లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య పాల్గొన్న లబ్ధిదారులు

కల్లూరు: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను సొమ్ము పెంచి అవ్వాతాతలకు అండగా నిలిచారని వైఎస్సార్ సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 35వ వార్డు చింతల మునినగర్‌లో 16 వార్డులకు చెందిన లబ్ధిదారులకు అట్టహాసంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రూ.3 వేలు పింఛన్ ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనన్నారు. పెరిగిన పింఛన్‌తో అవ్వాతాతల మోములో చిరునవ్వు కనిపిస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్ శభాష్ అనిపించుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కర్నూలు, అన్నమయ్య జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ (కార్పొరేటర్) శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు మాధురి, అరుణ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మిరెడ్డి, నారాయణరెడ్డి, నరసింహులు, కో–ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

“ మాట నిలబెట్టుకున్నారు



సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచారు. పెరిగిన పింఛన్ మాలాంటి పేదలకు ఆరోగ్య అవసరాలకు, మందలకు ఎంతగానో ఉపయోపడుతుంది. గతంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్ జగన్ వచ్చాక వలంటీర్ల ద్వారా ప్రతినెలా 1వ తేదీన తెల్లారకముందే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారు.

– వన్నూరమ్మ, చింతలముని నగర్

“ జగనన్నే మళ్లీ రావాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చారు. పింఛన్ అర్హుత వయస్సు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించడం ద్వారా ఎంతో మందికి మేలు చేశారు. వృద్ధులు చిన్న చిన్న అవసరాలకు, మాత్రలకు కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా పింఛన్ సొమ్ము ఉపయోగపడుతుంది. అవ్వాతాతల సంక్షేమ కోసం ఇంతగా తపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలి.

– పి.రామ్‌గోపాల్ శెట్టి, మాధవనగర్

ఆర్బీకేల్లో జొన్నల కొనుగోలు

గడివేముల: మండలంలోని రైతులు పండించిన జొన్న దిగుబడులను స్థానిక రైతు భరోసా కేంద్రాలలో మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు ఏఓ హేమసుందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో రైతులు ఆరు వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేసినట్లు చెప్పారు. సివిల్ సప్లైస్ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాలుకు రూ.3180 ప్రకారం జొన్నలను రైతుల నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు పంట నమోదు చేసుకుని ఉండాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి కృషి చేయండి

కర్నూలు (న్యూటౌన్): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేసి స్థలాలు కబ్జా కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్ మహమ్మద్ షరీఫ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా కోరారు. ఈ మేరకు శుక్రవారం డాక్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీలో ఆయా సంఘాల నాయకులు పర్యటించారు. వారు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధికి, ఉర్దూ బాషాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వర్సిటీ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్యన్, ఆవాజ్ కమిటీ నగర ఉపాధ్యక్షులు ఇలియాస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజశ్యామల మహాయాగం



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

కోడుమూరు: కోడుమూరులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీధర్మపురి అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన రాజశ్యామలాంబ మహాయాగాన్ని వేదపండితులు అత్యంత ఘనంగా నిర్వహించారు. మహాయాగంలో 200కుపైగా జంటలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూర్వక అష్టాదశ శక్తి పీఠాంబికా సహిత శ్రీవిజయ రాజశ్యామలాంబ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అలాగే కేంద్ర మాజీ సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల హరిచక్రపాణిరెడ్డి, కోట్ల రాఘవేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణతో పాటు, పలువురు ప్రముఖులు పాల్గొని అయ్యప్పస్వామికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు భాస్కరరెడ్డి చిట్టిబాబు, గురుస్వామి, గంగాధర్, రవికుమార్, గోపి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సూర్యనారాయణకు నివాళి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కార్మిక నాయకుడిగా ఎదిగి కష్టజీవుల కోసం అహర్నిశలు కృషి చేసిన సూర్యనారాయణ ఆశయాలకు అంకితమవుదామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లోని సూర్యనారాయణ భవనంలో పి.సూర్యనారాయణ 35వ వర్ధంతి సభ న్యూసిటీ కార్యదర్శి రాముడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టజీవుల కోసం అహర్నిశలు కృషి చేసి ప్రజల మన్నన పొందిన పి.సూర్యనారాయణను హత్య చేసిన వారిని రాజకీయంగా సమాధి చేయాలన్నారు. సీఐటీయూ, డీవైఎఫ్ఐ, రైతు సంఘం, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే సూర్యనారాయణ భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి ఊపిరితిత్తుల వార్డులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

బాలుడిపై వీధికుక్క దాడి

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామానికి చెందిన షేక్ ఉజైపా అనే బాలుడిపై శుక్రవారం వీధికుక్క దాడిచేసింది. గాయపడిన బాలుడిని గడివేముల పీహెచ్‌సీకి తరలించగా డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. గ్రామంలో కుక్కల బెడద నివారించాలని బాలుడి తండ్రి ఇమ్రాన్ కోరారు.

కోలుకోలేక కార్మికుడి మృతి

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం సోలార్ పరిశ్రమలో కార్మికుల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన కార్మికుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్ శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. బీహార్‌కు చెందిన మహ్మద్‌సాదాబ్ అనే కార్మికుడు పాటలు వింటుండగా సౌండ్ తగ్గించాలని చెప్పడంతో ఘర్షణకు దారితీసింది. తోటి కార్మికులైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్‌సాగర్, రాజకిషోర్, శాంతరాం మహ్మద్ సాదాబ్‌పై కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మహ్మద్‌సాదాబ్‌ను కర్నూల్ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. అతని మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు.

మందుల కిట్లు పంపిణీ

కర్నూలు సిటీ: మండల పరిధిలోని ఈ.తాండ్రపాడులో పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు పలువురికి శుక్రవారం మందుల కిట్లను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులున్న ఆరుగురికి వారి ఇళ్ల వద్దకే వెళ్లి వ్యాధులకు సంబంధించిన మందులతో కూడిన కిట్లను అందజేశారు.

ఆనంద‘మనీ’పెంచెన్



కొత్తగా మంజూరైన పింఛన్‌ను లబ్ధిదారుడికి అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప

కోడుమూరు రూరల్: ఇచ్చిన మాట మేరకు వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3 వేలకు పెంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు అండగా నిలిచారని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోడుమూరులో కొత్తగా మంజూరైన పింఛన్ కానుకలను ఆయన సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ పెన్షన్ కానుక కింద లబ్ధిదారులకు రూ.3 వేలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లారెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే కోడుమూరులోని కోటవీధిలో వార్డు మెంబర్ కుమారి స్థానిక వలంటీర్లతో కలిసి లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేశారు.


మంచి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

సి.బెళగల్: ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని ఎంపీపీ బొంతల మునెప్ప సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.2,750 నుంచి రూ.3,000 వరకు పెంచిందన్నారు. కొందరికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, సర్పంచ్ పాండురంగన్న, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయంలో రాచపుండు!

మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ ముందు వరుసలో ఉంటుంది. ఇందులో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఒకటి. ప్రారంభంలో ఈ వ్యాధికి సంబంధించి పైకి ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ లోలోపల అది విస్తరించి ప్రాణాలు తీస్తుంది. దురదృష్టవశాత్తూ చాలా మంది మహిళలు సరైన అవగాహనలేక, సకాలంలో గుర్తించక ఈ వ్యాధి బారిన పడుతున్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జనవరి మాసాన్ని గర్భాశయ ముఖ ద్వార అవగాహన మాసంగా నిర్వహిస్తుంది.

- పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు
- జిల్లాలో 40 వేల మందికి ఈ సమస్య
- బాల్య వివాహాలు, ధూమ, మద్యపానాలు, నెలలు నిండకముందే ప్రసవాలు కారణం
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స
- అవగాహనే వ్యాధికి మందు
- జనవరి గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ అవగాహన మాసం



కర్నూలు(హాస్పిటల్): గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను వైద్యపరిభాషలో సెర్వికల్ క్యాన్సర్ అంటారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో నాలుగో అత్యంత సాధారణ క్యాన్సర్‌గా, మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇది రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిగణించబడుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉండే క్యాన్సర్ వైద్యుల వద్దకు ప్రతిరోజూ 80 నుంచి 120 మంది కొత్తగా క్యాన్సర్ బాధితులు వస్తున్నారు. అలాగే ప్రతిరోజూ 15 నుంచి 20 మందికి కీమోథెరపీ, 30 మందికి రేడియోథెరపీ చేస్తున్నారు. నిత్యం 120 నుంచి 150 మంది ఇన్‌పేషంట్లు చికిత్స తీసుకుంటున్నారు. ఇందులో 20 శాతం మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్(సెర్వికల్ క్యాన్సర్) బాధితులున్నారు. ఈ మేరకు ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఈ వ్యాధితో బాధపడుతున్న వారిసంఖ్య 40 వేల వరకు ఉంటుందని వైద్యుల అంచనా.

ఆరోగ్యశ్రీలో ఉచితంగా క్యాన్సర్‌కు చికిత్స

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్, నంద్యాలలోని శాంతి రామ్ హాస్పిటల్‌లలో క్యాన్సర్ వ్యాధులకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందుతోంది. దీంతో పాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ క్యాన్సర్ కణతులు తొలగించేందుకు నిర్వహించే శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. ఈ పథకం లేనప్పుడు రోగులకు లక్షల రూపాయలు ఖర్చు అయ్యేది. అన్ని ఆసుపత్రుల్లో క్యాన్సర్‌కు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకుని డిశ్చార్జ్ అయిన రోగులకు ఆసరా పథకం కింద రోజుకు రూ.225, నెలకు రూ.5వేలు తక్కువ గాకుండా ప్రభుత్వం అందజేస్తోంది.

● ఇలా చేస్తే నివారణ సాధ్యం

ప్రపంచ ఆరోగ్య సంస్థ 2020లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికను అందించింది. దీనికింద 2030 నాటికి 90 శాతం కౌమార బాలికలకు 15 సంవత్సరాల వయస్సులోపు హెచ్‌పీవీ వైరస్‌కు వ్యతిరేకంగా టీకాలు వేయాలి. 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన 70శాతం మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాలి. గర్భాశయ పూర్వక్యాన్సర్ లేదా క్యాన్సర్‌తో బాధపడుతున్న 90 శాతం మహిళలకు తగిన చికిత్స అందించాలి. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జనవరి మాసాన్ని సర్వికల్ క్యాన్సర్ అవగాహన మాసంగా హైలెట్ చేయాలి.

వ్యాధి లక్షణాలు

- సాధారణ రుతుక్రమం గాకుండా యోని నుంచి రక్తస్రావం
- లైంగిక సంపర్కం తర్వాత రక్తస్రావం
- పీరియడ్స్ ఆగిపోయిన తర్వాత రక్తస్రావం (మెనోపాజ్)
- యోని నుంచి దుర్వాసన, రక్తంతో కూడిన గడ్డలు రావడం
- మూత్రం, మలవిసర్జనలో ఆటంకాలు

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఎందుకు వస్తుందంటే!

ఈ క్యాన్సర్ ప్రధానంగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) అనే వైరస్ కారణంగా వస్తుంది. దీంతో పాటు తక్కువ వయస్సులో వివాహం చేయడం, లైంగిక సంబంధాలు కొనసాగించడం, స్త్రీ, పురుషులిద్దరిలో బహుళ లైంగిక భాగస్వాములుగా ఉండటం, ముందస్తు ప్రసవాలు, ఎక్కువ మంది పిల్లలను కనడం, ధూమపానం, మద్యపానం అలవాట్లు ఈ క్యాన్సర్ రావడానికి కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు. ఇది ప్రధానంగా 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సుగల స్త్రీలను ప్రభావితం చేస్తుంది.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో అడ్డుకట్ట



సాధారణంగా వైరస్ సోకిన 10 నుంచి 15 ఏళ్ల తర్వాత క్యాన్సర్‌గా మారుతుంది. దీనివల్ల వివాహం అయిన మహిళలు ప్రతి సంవత్సరం పాప్‌స్మియర్ టెస్ట్ చేయించుకుంటే, క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించగలిగితే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసుకోవచ్చు. దీనికితోడు కౌమారదశ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం వల్ల వారికి 70 నుంచి 80శాతం వరకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు.

– డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, మెడికల్ ఆంకాలజిస్టు, కర్నూలు

ప్రభుత్వ ఆసుపత్రిలో అందరికీ వైద్యపరీక్షలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనకాలజి విభాగానికి వచ్చే ప్రతి మహిళకు లక్షణాలు ఉన్నా లేకపోయినా సర్వికల్ క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నాము. ఈ పరీక్ష చాలా సులభమైంది. ఎలాంటి ఇబ్బంది ఉండదు. 30 ఏళ్లు దాటిన ప్రతి మహిళా లక్షణాలు ఉన్నా లేకపోయినా ఈ పరీక్ష చేయించుకోవాలి. దీనివల్ల క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి వారికి చికిత్స ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు 2030 నాటికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు లేకుండా చేయాలి. 9 నుంచి 14 సంవత్సరాల వయస్సులో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇస్తే ఈ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు.

–డాక్టర్ ఎ. శ్రీలక్ష్మి, గైనకాలజీ హెచ్‌వోడి, జీజీహెచ్, కర్నూలు

సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భరోసా



మెడికల్ కిట్టును అందిస్తున్న ఎంపీపీ గాడి రూతమ్మ



ఈ.తాండ్రపాడు గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కోడుమూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎంపీపీ గాడి రూతమ్మ అన్నారు. శుక్రవారం లద్దగిరిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకుని బీపీ, షుగర్, కంటి, రక్త, ఒంటి పరీక్షలు చేయించుకోవడంతో పాటు, ఈసీజీ తీయించుకోవాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామగిడ్డయ్య తనిఖీ చేసి చేశారు. ప్రజలకందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, హెచ్ఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ హెచ్ఈఓ చంద్రశేఖరరెడ్డి, డాక్టర్లు సంగీత, భాస్కర్, జయంతి, శ్రీమంత్, సీహెచ్ఓ శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఈ.తాండ్రపాడు గ్రామంలో..

కర్నూలు సిటీ: మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో ఫైలేరియా(బోధకాలు) వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు శుక్రవారం పలువురికి రక్త పరీక్షల నిమిత్తం రక్త నమూనాలను సేకరిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె విజయమాధురి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు బృందాలుగా ఏర్పడి ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించారు.

శనగలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న డీఏఓ మోహనరావు

పాణ్యం: మండల పరిధిలోని అనుసూరు గ్రామంలో పంట కోత ప్రయోగం చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుపూరు గ్రామంలో పంటకోత ప్రయోగం చేపట్టగా జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు పరిశీలించారు. గ్రామంలో 256, 307, 443, 445 సర్వే నంబర్లలో శనగ పంటలో పంట కోత ప్రయోగం చేశారు. నిర్దేశిత విస్తీర్ణంలో పంటకోత చేపట్టి దిగుబడిని లెక్కించారు. అనంతరం రైతులకు డీఏఓ పలు సూచనలు చేశారు. రైతులు భూసారం పెరిగేలా సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. పశువుల పేడ, ఇతర మొక్కలను పొలంలో కలియదున్నాలని సూచించారు. అధిక దిగుబడులు సాధించేందుకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ సిబ్బంది శరత్, ఏఈఈఓలు, ఎంపీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): చేతి వృత్తిదారుల సమాఖ్య రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు ఆవిష్కరించారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. చేనేతలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.